హైదరాబాద్ వార్త



### శ్మశాన వాటిక పేరుతో

# చెరువు స్థలం కబ్జా

- రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులపై స్థానికుల ఆగ్రహం
- వక్ఫ్‌బోర్డు ప్రతినిధులను అడ్డుకుంటున్న స్థానికులు
- ప్రభుత్వం ఇచ్చిన గెజిట్ ప్రకారమే కడుతున్నాం : వక్ఫ్‌బోర్డు ప్రతినిధులు



**నెక్‌నాంపూర్ సర్వే నెంబర్ 44లోని చెరువు భూమిని కబ్జాల నుంచి కాపాడాలని కోరుతున్న నాయకులు**

నార్సింగి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన అధికారుల అలతస్వం వలన కోట్ల రూపాయల విలువైన చెరువు భూమి కబ్జాకు గురవుతుందని గండిపేట మండలం నెక్‌నాంపూర్ గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వక్ఫ్‌బోర్డు స్థలమని ఇటీవల కొందరు ప్రతినిదులు వచ్చి చెరువు భూమిలో ప్రహారీ నిర్మిస్తున్నారు. మీకు ఇచ్చిన భూమి సర్వే నెంబర్ వేరు, మీరు ప్రహారీ కడుతున్న స్థలం సర్వే నెంబర్ వేరు అని స్థానికులు అడ్డుకొన్నారు. ఈ కబ్జా పర్వంను అడ్డుకోవాలని కోరుతూ స్థానిక కౌన్సిలర్ పద్మాకర్, నాయకులు థామోదన్‌రావ్, జయరాజ్, ధన్‌రాజ్ తదితరులు కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, ఇరిగేషన్, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎవరూ స్పందించడం లేదని ఆరోపించారు. గురువారం ఉదయం నెక్‌నాంపూర్ గ్రామ సర్వే నెంబర్‌లు 31, 44.లలోని ప్రభుత్వ భూముల్లో స్థానిక నాయకులు, ప్రజలు అంతా తిరిగి అక్కడ జరుగుతున్న అక్రమ ప్రహారీగోడల పనులను పరిశీలించారు. అనంతరం పాత్రికేయుల సమావేశం నిర్విహించి పద్మారావ్, జయరాజ్, ధన్‌రాజ్‌లు మాట్లాడుతూ 26.అక్టోబర్ 2002లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు నెక్‌నాంపూర్ సర్వే నెంబర్ 31.లోని 59.14.ఎకరాల భూమిని 803.జీవో ప్రకారం సెక్రెటేరియట్ ఉద్యోగులకు కేటాయించారు. ఇందులో నుంచి స్థానిక పేదల కోసమని 2008.లో 242. 60.గజాల పట్టాలను పంపిణీ చేశారు. గతంలో కొందరు ఇళ్లు కట్టుకోగా, మిగిలిన వారు ఇళ్లు కడుతుంటే ఇటీవల సర్వే నెంబర్ 31.లో 13.26ఎకరాలను వక్ఫ్‌బోర్డుకు కేటాయించిందని పేదలను అడ్డుకుంటున్నారని పేర్కొ న్నారు. 31.లో ఉన్న స్థలం మొత్తం సెక్రెటేరియట్ ఉద్యోగులకు ఇచ్చాక, మళ్లీ ఇదే సర్వే నెంబర్‌లో వక్ఫ్‌బోర్డుకు ఎలా స్థలం కేటాయిస్తారని ప్రశ్నిస్తున్నారు. అంతే కాకుండా సర్వే నెంబర్ 31.లో స్థలాన్ని కేటాయించినట్లు చెబుతూ సర్వే నెంబర్.44.లో ఉన్న చెరువు స్థలాన్ని కబ్జా చేస్తున్నారని, ఏకంగా 30.ఎకరాలకు పైనే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్నారని వెంటనే వీరి ఆగడాలను అడ్డుకొనాలని రాష్ట్ర ప్రభుత్వం ఇందులో కల్పించుకొని, నిరుపేదలకు న్యాయం చేయాలని స్థానిక నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

**ఇది మాకే కేటాయించిన స్థలం : వక్ఫ్ ప్రతినిధులు**

సర్వే నెంబర్ 31.లో మాకు వైఎస్సార్ సర్కారు 13.26.ఎకరాల స్థలంను కేటాయించిందని, అందులోనే మేము ప్రహారీ కట్టుకుంటున్నామన్నారు. స్థానికులు ఒక్కొక్కరు రెండు.మూడు పట్టాలు తెచ్చి నిర్మాణాలు కడుతున్నారని, మాకు కేటాయించిన స్థలాన్ని ప్రొటక్షన్ చేసుకుంటే అడ్డుకుంటున్నారన్నారు. ఒక్క గజం కూడా అదనంగా మా వద్ద లేదని తెలిపారు.

## వృద్ధుడిని ఆసుపత్రిలో చేర్పించిన వ్యక్తి మాయం

### చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి



గచ్చిబౌలి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడిని ఆసుపత్రిలో చేర్పించిన ఓ వ్యక్తి ఆసుపత్రి నుంచి ఉడాయించాడు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందగా, పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న గుర్తు తెలియని వృద్ధుడిని గురువారం మద్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి కొండాపూర్‌లోని జిల్లా ఆసుపత్రికి తీసుకువచ్చి చేర్పించాడు. ఆసుపత్రి సిబ్బంది వృద్ధుడికి చికిత్స చేయడం ప్రారంభించగా, వెంట వచ్చిన వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు కొద్దిసేపటికే మృతిచెందాడు. దీంతో కొండాపూర్ ఆసుపత్రి సిబ్బంది వృద్ధుడిని ఆసుపత్రిలో చేర్పించిన వ్యక్తి కోసం గాలించగా ఫలితం లేకపోయింది. చనిపోయిన వృద్ధుడి ఆచూకీ సైతం లభిం చలేదు. చనిపోయిన వృద్ధుడికి దాదాపు 60నుంచి 65ఏళ్ల వయస్సు ఉంటుం దని, ఆచూకీ కోసం పరిసర కాలనీలు, ప్రాంతాల్లో వెదికినా ఫలితం లేకపో యిందని సిబ్బంది తెలిపారు. దీంతో సిబ్బంది గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

## అర్థరాత్రి బైక్ స్టంట్లు

### టిహాబ్ రహదారిపై ఆరుగురు యువకుల అరెస్టు.. మూడు బైక్‌లు స్వాధీనం

గచ్చిబౌలి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : హైటెక్‌సిటీ రహదారులపై బైక్ రైడర్లు రెచ్చిపోతున్నారు. అర్థరాత్రి వేళల్లో జనసమర్థం తక్కువగా ఉండే రహదారుల మీద మితిమీరిన వేగం, భారీ శబ్దంతో ప్రమాదకర బైక్ స్టంట్లు చేస్తూ బంబేలెత్తిస్తున్నారు. బైక్ రైడర్ల స్టంట్ల కారణంగా ఈ దారుల్లో ప్రయాణించే ఇతర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి అదుపుతప్పుతున్న బైక్‌లు ఇతర వాహనాలను ఢీకొట్టి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. తాజాగా హైటెక్‌సిటీ పరిధిలోని నాలెడ్జ్ సిటీ రహదారుల మీద బైక్ స్టంట్లు చేస్తూ ర్యాష్ డ్రైవింగ్‌తో దూసుకుపోతున్న ఆరుగురు బైక్ రైడర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... హైటెక్‌సిటీ నాలెడ్జ్ సిటీలో గల టిహాబ్ రహదారి మీద బుధవారం అర్థరాత్రి బైక్ స్టంట్లు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో గురువారం తెల్లవారు జామున 2 గంటల ప్రాంతంలో టిహాబ్ రహదారి వద్దకు చేరుకున్న ఎస్‌ఓటీ పోలీసులు రహదారిపై బక్‌స్టంట్లు చేస్తున్న లంగర్‌హౌజ్‌కు చెందిన షేక్ సల్మాన్(21), అఫ్రోజ్‌ఖాన్(20), మహ్మద్ సోహేల్(20), ఇమ్రాన్‌ఖాన్, మీర్ సోహేల్(20), ఎండి ఇమ్రాన్‌ఖాన్(21)లను అదుపులోకి తీసుకొని రాయదుర్గం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి ఒక పల్సర్, ఒక బుల్లెట్, రెండు హోండా యాక్టివా వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు నిందితులను అరెస్టు చేసిన రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## అన్నను కత్తితో గొంతు కోసి హత్య చేసిన తమ్ముడు

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : మతి స్థిమితం లేని అన్నను స్వంత తమ్ముడు కత్తితో గొంతు కోసి దారుణంగా హత్య చేసిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతి చెందిన అన్నకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మధు కథనం ప్రకారం.. శాస్త్రిపురంకు చెందిన మహ్మద్ అబ్దుల్ రెహ్మాన్ (36), మహ్మద్ ఇస్మైయిల్ (22) స్వంత అన్నదమ్ములు. మహ్మద్ అబ్దుల్ రెహ్మాన్‌కు భార్య ఇద్దరు పిల్లలు కలరు. మతిస్థిమితం లేని అబ్దుల్ రెహ్మాన్ వెల్డర్‌గా పని చేస్తున్నాడు. కాగా అబ్దుల్ రెహ్మాన్ తరుచుగా తన సోదరుడు మహ్మద్ ఇస్మైయిల్‌ను చంపుతానని బెదిరించేవాడు. బుధవారం అర్ధ రాత్రి బయట ఉన్న అబ్దుల్ రెహ్మాన్‌ను త మ్ముడు ఇస్మైయిల్ ఇంటికి తీసుకు వచ్చాడు. ఇద్దరు సోదరుల మధ్య వివాదం చోటు చేసుకుంది. అన్న మహ్మద్ అబ్దుల్ రెహ్మాన్ తమ్ముడు ఇస్మైయిల్‌ను చంపుతానని హెచ్చరించాడు. కోపంలో ఉన్న తమ్ముడు మహ్మద్ ఇస్మైయిల్ అన్న అబ్దుల్ రెహ్మాన్‌ను కత్తితో గొంతు కోశాడు. ఈ సంఘటనలో తీవ్ర గాయాల పాలైన అబ్దుల్ రెహ్మాన్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన అబ్దుల్ రెహ్మాన్ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. మహ్మద్ ఇస్మైయిల్‌ను పోలీసులు అదుపులోకీ తీసుకున్నా రు. ఈ కేసును మైలార్‌దేవ్‌పల్లి అన్నికోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.



తల్లీ కొడుకులను ఢీకొట్టిన డిసిఎం వ్యాన్

## తొమ్మిదేళ్ళ బాలుడి మృతి

వివవరాలు మైయిన్ పేజీలో..

# ఆపదలో వైద్యం!

## నిమ్స్‌లో ఎమర్జెన్సీకి వెయిటింగ్




జనగాం జిల్లాకి చెందిన సోములు అనే వ్యక్తికి గుండె నొప్పితో నిమ్స్‌లో అడ్మిట్ అయ్యాడు. ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించగా..గుండెకు రక్తం సరఫరా చేసే మూడు వాల్స్ బ్లాక్ అయ్యాయని, ఒపెన్ హార్ట్ సర్జన్ చేయాలని వైద్యులే నిర్ధారిం చారు. అయితే గుండె శస్త్రచికిత్స చేయాలంటే మీకు ముందు 30 మంది రోగులు వెయిటింగ్‌లో ఉన్నారు. మరో పది రోజుల తర్వాత మళ్లీ హాస్పిటల్ వస్తే శస్త్రచికిత్స చేస్తామని చెప్పి ఆతడిని డిశ్చార్జి చేసేసారు. ఇది కేవలం ఆ రోగికి ఎదురైన సమస్యే కాదు అత్యావసర శస్త్ర చికిత్సల కోసం నిమ్స్ హాస్పిటల్‌కు వెళ్లిన రోగులందరికీ ఇదే ఎదురవుతుంది. ఆరోగ్యం బాగుచేసుకోవడా నికి వెళ్ళి దేవుడిపై బారంవేయాల్సిన పరిస్థితి నెలకొన్నాయి.

- అత్యావసర ఆపరేషన్ కోరితే వెయిటింగ్‌లో ఉండాల్సిందే
- రైల్వే రిజర్వేషన్ తరహాలో కొనసాగుతున్న నిమ్స్ వెయిటింగ్
- ఇచ్చిన తేదీలోపు రోగి చనిపోతే ఇక అంతే సంగతులు
- గుండె, ఎముకలకు సంబంధించిన కీలక శస్త్రచికిత్సలు పెండింగ్
- నిమ్స్ రోజువారి సేవలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిందే..

హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : వైద్యరంగంలో అధునాతన సేవలతో సామాన్య మధ్య తరగతి ప్రజలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించే సంస్థగా పేరుపొందిన నిమ్స్‌లో ఇపుడు రోగులకు రైల్వే రిజర్వేషన్ల తరహాలో వెయిటింగ్ లిస్ట్ వేధిస్తోంది. సామాన్య పౌరులకు సైతం కార్పొరేట్ వైద్యం చేరువచేయాలన్న లక్ష్యంతో అసెంబ్లీలో చట్టం చేసి అందుకు అనుగుణంగా నిజామ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌మెడికల్ సైన్సెస్‌ను స్థాపించారు. నాటి నుంచి నేటి వరకూ వైద్యసేవలు అందిస్తున్న ఈ నిమ్స్‌కు వెళితే తమకు రోగం నయం అయిపోతుందన్న అపార విశ్వాసం గ్రామీణ ప్రజల్లో ఉంది. ఆరోగ్యశ్రీ, తెల్లరేషన్‌కార్డుల సాయంతోనే నిమ్స్‌లో ఉన్న అధునాతన సేవలను పొందగలమన్న ధీమా గ్రామీణ జనావళిలో నాటుకుని పోయింది. గుండె సంబంధిత వ్యాధులకు, ఆర్థోపెడిక్ తదితర చికిత్సలకు గాను నిమ్స్‌కు వెళ్లితే చాలు చనిపోతారనుకున్న వారు సైతం లేచి చకచకా నడుచుకుంటూ వస్తారన్న నమ్మకం ఇప్పటికీ ఉంది. అయితే అందుకు తగినట్లుగా అక్కడ వైద్యసేవలు అందడంలేదు. ఎంతో విశిష్టమైన లక్ష్యంతో నిమ్స్ డైరెక్టర్ అంటే ఇప్పటికీ కాకర్ల సుబ్బారావు గుర్తుకు వస్తారు. ఆనాడు నిమ్స్‌ను ఆతరహాలో నడిపించారని ఆయన్ను ఇప్పటికీ స్మరించుకుంటూ ఉంటారు. సంస్థకు భారతీయ వైద్యమండలి గుర్తింపు కూడా ఉంది. ప్రత్యేక గవర్నింగ్ కౌన్సిల్ నిమ్స్ వ్యవహారాలను పర్యవేస్తుంది. గడచిన 20 ఏళ్లుగా కూడా ఎప్పటికప్పుడు బులిటెన్లు ప్రచురిస్తూ వస్తోంది. 1964లో ఆనాటి రైల్వే మంత్రి ఎన్‌కె పాటిల్ ప్రారంభించిన నిమ్స్‌లో గుండె కవాటాలకు ఏర్పడిన బ్లాక్‌లను తొలగించాలంటే ఇపుడు సుదీర్ఘకాలం వేచి చూడాల్సి వస్తోంది. ఇటీవలే మూసుకుపోయిన బ్లాక్‌లకు శస్త్రచికిత్స చేయాలని నిమ్స్ వైద్యులే సూచించారు. అయితే గుండె శస్త్రచికిత్స చేయాలంటే మీకు ముందు 30 మంది ఉన్నారు. మీ తేదీ వచ్చేవరకూ వేచి ఉండాలని స్పష్టంగా చెప్పి ఆతడిని డిశ్చార్జి చేసేసారు. అయితే అందరికీ ఇదే పరిస్థితి ఉంటే ఇక నిమ్స్‌కున్న పరువుప్రతిష్టలు మంటగలిసినట్లే. ఇటీవలి కాలంలో నిమ్స్‌లో అధునాతన వసతులు ఏర్పడ్డాయని, దేశంలోనే అత్యున్నత సంస్థగా తీర్చిదిద్దుతున్నట్లు ప్రకటించారు పాలకులు. అందుకు తగినట్లుగానే అభివృద్ధి జరిగింది. దేశ విదేశాల్లో పేరుప్రఖ్యాతులున్న వైద్యనిపుణులు ఇక్కడ సేవలందిస్తారు. అయితే ఈ వెయిటింగ్ జాబితాతోనే కొందరు శ్వాసవిడుస్తున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఇలా వెయింటిగ్ అంటే గుండెకు సంబంధించిన శస్త్రచికిత్సలను కూడా వెయిటింగ్ అంటే ఎలా? ఈలోపు జరగరానిది ఆ రోగికి జరిగితే అందుకు బాధ్యులెవరు? అన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఏంతో ధైర్యంతో గుండె నిబ్బరం చేసుకుని నిమ్స్‌కు వస్తే తమ రోగాలన్నీ మాయం అవుతాయన్న నమ్మకాన్ని ఇపుడు నిమ్స్ పాలకవర్గం పోగొట్టుకుంటున్నదని స్పష్టం అవుతోంది. ఇలాంటి దయనీయ రోగుల పట్ల కనీస కనికరం చూపించకపోతే నిమ్స్ వ్యవస్థాపక లక్ష్యం ఎంతమాత్రం నెరవేరదని తెలుస్తోంది. ఇప్పటి వరకూ పనిచేసిన

మిగతా సిటీ 3వ పేజీలో



తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపా దాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న గ్రేటర్ మాజీ ఉపమేయర్, బోరబండ కార్పోరేటర్ బాబా ఫసియుద్దీన్

### కాంగ్రెస్‌లోకి బిఆర్ఎస్

## మాజీ డిప్యూటీ మేయర్

### ఎమ్మెల్యేతో విభేదాలేనా..?

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్‌కు షాక్ తగిలింది. జిహెచ్‌ఎమ్‌సి మాజీ ఉప మేయయర్, బోరబండ కార్పొరేటర్ బాబాఫసియుద్దీన్ ఆపార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరారు. ఈమేరకు తన రాజీనామాను రాష్ట్ర బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు పంపించారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రాధమిక సభ్యత్వా నికి, మీడియా స్పోక్స్ పర్సన్ పదవికి రాజీనామా చేశారు. ఇటీవల కాలంలో పార్టీ అనుసరించిన విధానాలు తనకు నచ్చలేదని పార్టీ ఆవిర్భావం నుంచి ఎంతో కష్టపడి పనిచే శానని, తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి నాయకుడిగా చురుకుగా పాల్గొన్నానని పార్టీ అభివృద్ధికి కృషి చేశానని అలాంటి నాకు రాజకీయ భవిష్యత్తు లేకుండా కొందరు నాయకులు కుట్ర చేస్తుంటే అధినాయకత్వం వారిపై కనీస చర్యలు తతీసుకోక పోగా, వారికే మద్దతు ఇవ్వడం తనను తీవ్రంగా బాధించిందని పేర్కొన్నారు. రాజకీయంగానే కాకుండా భౌతికంగా లేకుండా చేసే కుట్ర జరుగుతుందని తెలిసి అధినాయకత్వం దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకువెళ్ళిన ప్రయోజనం కనబడలేదన్నారు. గుండెల నిండా గులాబి జెండాతో 22ఏళ్ళు పార్టీ కోసం సిపాయిగా పనిచేసిన ఉద్యమకారుడికి రక్షణ కరువైందని అందుకే తాను పార్టీ ప్రాతమిక సభ్యత్వానికి, మీడియా స్పోక్స్ పర్సన్ పదవికి రాజీనామా చేసి తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపా మున్షి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు.

**ఎమ్మెల్యేతో విభేదాలు..** ఉద్యమం కాలంనుంచి పార్టీలో చురుకుగా ఉన్న బాబాఫసియుద్దీన్‌కు జూబ్లిహిల్స్ నియోజకవర్గం శాసన సభ్యులు మాగంటిగోపినాధ్‌తో విబేధాలు ఏర్పడ్డాయి. దీనితో వీరిద్దరి మధ్య వర్గపోరు పార్టీలో నివురుకప్పిన నిప్పులా మారింది. ఈవిషయమై పలుమార్లు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మిగతా సిటీ 3వ పేజీలో

### పాఠశాల సిబ్బందికి ఆర్థిక సహాయం అందజేసిన శ్రీరంగం ఫౌండేషన్

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : కెపిహెచ్‌బి కాలనీలోని పాఠశాల సిబ్బందికి శ్రీరంగం ఫౌండేషన్ వారు ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గం కెపిహెచ్‌బి కాలనీలోని భువన విజయం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనరాజ కుమారి గతంలో ఇద్దరు ఉపాధ్యాయులకు, పాఠశాలలోని తరగతి గదులు శుభ్రం చేసే వ్యక్తికి వేతనాన్ని ఇవ్వమని శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ డా.సత్యం శ్రీరంగంను కోరారు. అందుకు అంగీకరించిన సత్యం శ్రీరంగం తన శ్రీరంగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇచ్చిన మాట ప్రకారం జనవరి నెల వేతనాన్ని కూడా శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్మన్ ఇందుమతి శ్రీరంగం చేతుల మీదుగా పాఠశాలలో అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరంగం ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పాఠశాలలను సందర్శించిన కలెక్టర్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న హైదరాబాద్ జిల్లా కలెక్టర్

హైదరాబాద్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త: విద్యార్థులు పట్టుదలతో కష్టపడి చదివితేనే పరీక్షల్లో విజయం సాదిస్తారని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. గురువారం బంజారాహిల్స్ రోడ్‌నెంబర్ 12లోని ఎన్‌బిటి నగర్‌లోని ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి అక్కడ పదవ తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ టాలెంట్ లేకున్నా.. పట్టుదల కష్టపడే తత్వం మీలో ఉంటే పరీక్షల్లో విజయం సాధించవచ్చునన్నారు. టాలెంట్ ఉండి కష్టపడే తత్వం లేకుంటే మీరు అనుకున్నది సాధించలేరన్నారు. ప దవ తరగతి అనేది టర్నింగ్ పాయింట్ అని దీనిని విద్యార్థులు తేలికగా తీసుకోవద్ద న్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్ట్‌లపై దృష్టిపెట్టాలని, స్లిప్‌టెస్టులు, మాక్‌టెస్టులు ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలని అప్పుడే విద్యార్థులకు పరీక్ష ఫోబియా పోతుందన్నారు. ప్రతి సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని సూచించారు. అనంతరం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని మహేంద్రహిల్స్ లోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. మంచి మార్కులు తెచ్చుకుంటే యూనివర్సిటీలో సీటు వస్తుందని జీవితంలో మంచిగా స్థిరపడాతారని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ అధికారి యాదయ్య, సికింద్రాబాద్ ఆర్డీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ జిల్లాలో 45,70 లక్షల ఓటర్లు

**ప్రత్యేక ఓటరు జాబితా సవరణను ప్రకటించిన జిల్లా ఎన్నికల అధికారి**

**పురుషులు 23,30,574, మహిళలు 22,39,240, ఇతరులు 324**

హైదరాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : హైదరాబాద్ జిల్లా పరిధిలో ఉన్న 15 నియోజకవర్గాలలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణను జిల్లా ఎన్నికల అధికారి గురువారం ప్రకటించారు. జనవరి 1, 2024 నాటికి అర్హత ఉన్నవారిని జాబితాలో చేర్చారు. ఓటరు జాబితాను ప్రకటించిన నేపథ్యంలో ఓటర్లు వారి పేర్లను సరిచూసుకోవాలని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెబ్‌సైట్‌లోగానీ, ఓటర్ హెల్ప్ యాప్‌లో గానీ ఫాం.6, ఫాం.7, ఫాం.8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో మొత్తం 3986 పోలింగ్ స్టేషన్‌ల ఉండగా, ఓటర్లు 45,70, 138మంది ఉన్నారు. అందు లో పురుషులు 23,30,574, మహిళలు 22,39, 240, ఇతరులు 324 మంది ఉన్నారు.

| ని.సం | నియోజకవర్గం | పోలింగ్ బూతులు | పురుషులు | మహిళలు | ఇతరులు | |
|---|---|---|---|---|---|---|
| 57 | ముషీరాబాద్ | 276 | 156947 | 149422 | 12 | 306381 |
| 58 | మలక్‌పేట | 300 | 159250 | 156369 | 15 | 315634 |
| 59 | అంబర్‌పేట | 236 | 140458 | 138206 | 11 | 278675 |
| 60 | ఖైరతాబాద్ | 245 | 153835 | 142514 | 34 | 296383 |
| 61 | జుబ్లిహిల్స్ | 329 | 202177 | 185008 | 21 | 387206 |
| 62 | సనత్‌నగర్ | 229 | 130848 | 121673 | 9 | 252530 |
| 63 | నాంపల్లి | 277 | 165582 | 157377 | 8 | 322967 |
| 64 | కార్వాన్ | 311 | 185420 | 177588 | 9 | 363017 |
| 65 | గోషామహల్ | 235 | 143179 | 131463 | 26 | 274668 |
| 66 | చార్మినార్ | 198 | 119217 | 109251 | 30 | 228498 |
| 67 | చాంద్రాయణగుట్ట | 305 | 172944 | 174635 | 35 | 347614 |
| 68 | యాకత్‌పుర | 332 | 179682 | 176266 | 31 | 355979 |
| 69 | బహదూర్‌పుర | 261 | 161240 | 159954 | 50 | 321244 |
| 70 | సికింద్రాబాద్ | 220 | 133649 | 133608 | 25 | 267282 |
| 71 | కంట్రోన్మెంట్ | 232 | 126146 | 125906 | 8 | 252060 |
| | మొత్తం | 3986 | 2330574 | 2239240 | 324 | 4570138 |

### రోడ్డు ప్రమాదంలో

## కొటక్ మహేంద్ర ఉద్యోగి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాయి కుమార్

చార్మినార్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : రోడ్డు ప్రమాదంలో కొటక్ మహేంద్ర ఉద్యోగి మృతి చెందిన సంఘటన గురువారం హుస్సేనీ ఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రియాంక కథనం ప్రకారం.. పాతబస్తీ ఉప్పుగూడ ప్రాంతానికి చెందిన క్రిష్ణ కొడుకు సాయి కుమార్ (33) సోమాజిగూడలోని కొటక్ మహేంద్రలో ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం ఉదయం సాయి కుమార్ ది ్వచక్ర వాహనంపై ఉప్పుగూడ నుంచి సోమాజిగూడలోని కొటక్ మహేంద్రకు బయలు దేరాడు. పాతబస్తీ ఖిల్వత్ రహదారిలో సాయి కుమార్ వస్తున్న సమయంలో కుక్క వాహానానికి అడ్డంగా వచ్చింది. ఒక్క సారి సడన్ బ్రేక్ వేయటంతో సాయి కుమార్ కింద పడటంతో తలకు బలమైన గాయాలు అయ్యాయి. తీవ్రగాయాల పాలైన సాయి కుమార్ ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. హుస్సేనీఆలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ట్రేడ్ లైసెన్సు కోసం బెదిరిస్తున్న వారిపై కేసులు పెట్టాము

నార్సింగి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : మణికొండ మున్సిపల్ పరిధిలో ట్రేడ్ లైసెన్సు కోసం అపరిచిత వ్యక్తులు చేసే బెదిరింపులకు వ్యాపారులు ఎవరూ భయపడవద్దని కమీషనర్ ఫల్గుణ్ కుమార్ తెలిపారు. ఫోన్‌లలో బెదిరిస్తున్న వారిపై నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశామని, పోలీసులు కేసు నమోదు చేశారని, చట్టపరమైన చర్యలు ఎదుర్కొనేందుకు సదరు వ్యక్తులు సిద్ధంగా ఉండాలన్నారు. వ్యాపారులెవ్వరూ బెదిరింపులకు గురి చేసే వారికి లొంగ వద్దని, అవసరమైన వారు నేరుగా ఆన్‌లైన్‌లోనే ట్రేడ్ లైసెన్స్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని, ప్రభుత్వ నిబంధనల మేరకు ఉంటే త్వరగానే ట్రేడ్ లైసెన్స్ జారీ చేస్తామని కమీషనర్ తెలిపారు.



నూతనంగా ఎంపికైన సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

## కాలనీ అభివృద్ధిలో నా మద్దతు ఎప్పుడూ ఉంటుంది : ఎమ్మెల్యే వివేకానంద

నిజాంపేట్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త: కాలనీ అభివృద్ధిలో నావంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని, సంక్షేమ సంఘాల ఐకమత్యంతో కాలనీల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కెపి వివేకానంద సూచించారు. గురువారం కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బాచుపల్లికి చెందిన ఏబీఆర్ ప్రవీణ్ ఆంటిలియా నూతన సంక్షేమ సంఘం అధ్యక్షులుగా నియమితులైన జి.మహేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.నాగేశ్వరరావులు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సుబ్బారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కెపి వివేకానందను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద నూతనంగా ఏర్పడిన సంక్షేమ సంఘ అధ్యక్ష, కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## నేరాలను కట్టుదిట్టం చేసేందుకు సీసీ కెమరాలు ఎంతో మేలు : ఎమ్మెల్యే మల్లారెడ్డి



1వ వార్డు బాపూజీ నగర్‌లో సీసీ కెమరాలనుప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: నేరాలను కట్టుదిట్టం చేసేందుకు సీసీకెమరాలు ఎంతో అవసరమని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సి.హెచ్.మల్లారెడ్డి తెలిపారు. కంటోన్మెంట్ 1వ వార్డు శ్రీ ముత్యాలమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమరాలను జంపన ప్రతాప్‌తో కలిసి ప్రారంభించారు. సీసీ కెమరాలను డొనేట్ చేసిన బిఆర్ఎస్ నేత అరుణ్ యాదవ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్‌రావ్, దుర్గేశ్, అజిత్ పాల్గొన్నారు.

## చెరుకుపల్లి కాలనీలో రోడ్ల నిర్మాణాలను చేపట్టాలి: ఎండి. జాకీర్



కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉపకమిషనర్ వద్దేపల్లి నర్సిమ్మాకు చెరుకుపల్లికాలనీ-1లో రోడ్ల నిర్మాణాలకు చొరవచూపాలని వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ డివిజన్ చెరుకుపల్లి కాలనీలో గతంలో ప్రతిపాదించిన రోడ్ల నిర్మాణాలకు అధికారులు చర్యలు చేపట్టాలని కుత్బుల్లాపూర్ మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీడివిజన్ అధ్యక్షులు మహ్మద్ జాకీర్ విజ్ఞప్తిచేశారు. గురువారం కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉపకమిషనర్ వద్దేపల్లి నర్సింహ్మాకు కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. చెరుకుపల్లికాలనీ-1లో రోడ్‌నెంబరు 2 కుటుంబరావు ఇంటినుండి నర్సింహ్మా ఇంటివరకు, అప్పాలబస్తీ ఎదురుగా సురేందర్‌రెడ్డి ఇంటిదగ్గర నుండి సుబ్బారావు ఇంటివరకు, మీసాలరాములు ఇంటివరకు, శ్రీనివాస్ ఇంటినుండి మల్లేశ్‌జ్యోతి ఇంటివరకు రోడ్డునెంబరు 16,18లో యం.రాజు ఇంటిమీదుగా తిరుపతి రెడ్డి, పరమేశ్ ఇంటివరకు, రోడ్‌నెంబరు 5,7,8కిశోర్‌చారి ఇంటి నుండి రామిరెడ్డి ఇంటివరకు, బాస్కర్ ఇంటి దగ్గరనుండి ఎల్లయ్య ఇంటివరకు రోడ్ల నిర్మాణ పనులను చేపట్టాలని విజ్ఞప్తిచేశారు.

## నగదు పోగోట్టుకున్న మహిళాకు నగదు అందజేసిన గోషామహల్ ట్రాఫిక్ పోలీసులు



బేగంబజార్,ఫిబ్రవరి 8ప్రభాతవార్త: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న నుమాయిష్‌ను తిలకించేందుకు వచ్చి పోగొట్టుకున్న నగదు విధినిర్వహణలో ఉన్న గోషామహల్ ట్రాఫిక్ మహిళా కానిస్టేబుల్‌కు దొరికాయి. వెంటనే ఈవిషయాన్ని గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.మహేష్‌కు సమాచారం అందించారు.ట్రాఫిక్ పోలీసు ఔట్ పోస్టులో మైక్ ద్వారా అనౌన్స్ చేయడంతో బాధిత మహిళా సంపూర్ణ లక్ష్మి ట్రాఫిక్ పోలీసు ఔట్ పోస్టుకు చేరుకుని పూర్తి వివరాలు చెప్పడంతో ఆమెకు నగదును అందచేసి శబాష్ పోలీసు అనిపించుకున్నారు.



పికెట్‌లో మాజీ మంత్రి డి.నర్సింగ్‌రావ్‌కు నివాళులలిస్తున్న కంటోన్మెంట్ బిజెపి ఇన్‌ఛార్జి ఎన్.శ్రీగణేష్,కాంగ్రెస్ నేతలు సంజీవరావ్,సురేశ్,అశోక్ తదితరులు

## మాజీ మంత్రి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి : బొల్లుకిషన్



పికెట్‌లో మాజీ మంత్రి నర్సింగ్‌రావ్‌కి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత బొల్లు కిషన్ తదితరులు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజలకు ఎనలేని సేవలు అందించిన మాజీ మంత్రి, దివంగత డి.నర్సింగ్‌రావ్ సేవలు మరువలేనివని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ కంటోన్మెంట్ ఇన్‌ఛార్జి బొల్లు కిషన్ తెలిపారు. నర్సింగ్‌రావ్ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం పికెట్‌లోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దివంగత నర్సింగ్‌రావ్ కుమారుడు కాంగ్రెస్ నేత డీ.ఎన్.సంజీవ రావ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు గుంటి క్రిష్ణ, ఎస్.వెంకటేశ్, నాగిరెడ్డి, నందు, వాసు, రాజశేఖర్, రాజేశ్, సర్వేశ్, సచిన్ పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

**కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్**



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

వివేకానంద నగర్ కాలనీ, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త: 124 డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్‌టిఆర్‌నగర్ నుండి పీజెఆర్‌నగర్ వరకు వెళ్ళే రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా సీసీ రోడ్డు నిర్మాన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, గుడ్ల శ్రీనివాస్, సిహెచ్ భాస్కర్, పోశెట్టిగౌడ్, మహేష్, మహబూబ్, వర్క్ ఇన్స్‌పెక్టర్ రవి కుమార్ పాల్గొన్నారు.

## అందెశ్రీని సత్కరించిన రమణాచారి



తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీని సన్మానిస్తున్న డా. కె.వి.రమణాచారి దంపతులు

నాంపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : ప్రముఖ విశ్రాంత ఐఎఎస్ అధికారి, సాంస్కృతిక సౌజన్యమూర్తి డా. కె.వి.రమణ 72వ జన్మదిన వేడుకలు రెడ్‌హిల్స్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం ఉదయం నుండి ప్రముఖుల శుభాకాంక్షలతో కన్నుల పండుగగా సాగాయి. ఈ వేడుకలకు ఉభయ తెలుగురాష్ట్రాల నుండి అనేకమంది ప్రఖ్యాతిగాంచిన సాహితీవేత్తలు, డాక్టర్లు, సాంస్కృతిక సంస్థల అధిపతులు, రచయితలు, పాత్రికేయులు, ప్రముఖ వాణిజ్య పారిశ్రామికవేత్తలు, వివిధ రంగస్థల, టీవి, సినీ కళాకారులు, జానపద, శాస్త్రీయ, సంప్రదాయ నృత్యకళాకారులు, పలు ప్రభుత్వ ప్రభుత్వేతర శాఖల్లో పనిచేస్తున్న అధికారులతోపాటు తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రకటింపబడిన జయజయహే తెలంగాణ రచయిత అందెశ్రీ తదితరులు వందల సంఖ్యలో విచ్చేసి డా. కె.వి.రమణాచారిని ఘనంగా సత్కరించి ఆయన సాంస్కృతిక, సాహిత్య, సామాజిక, ఆధ్యాత్మిక తదితర ఎన్నో రంగాలకు చేస్తున్న విశేషసేవలు అనితరసాధ్యమని కొనియాడుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## సుమన్ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన కాంగ్రెస్ నాయకులు



సిఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సుమన్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న వట్టినాగులపల్లి కాంగ్రెస్ నాయకులు

నార్సింగి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను గురువారం గండిపేట మండలం వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శిశుపాల్‌సింగ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డిపై అల్క మాటలు మాట్లాడితే బట్టలిప్పి కొడ్తామని హెచ్చరించారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రంను బిఆర్ఎస్ నాయకులు పదేళ్ల పాలించి, అడుగడుగునా తెలంగాణ ప్రజల కష్టంను కమీషనర్ల రూపంలో దండుకొని, లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని ఆరోపించారు. భారీ ప్రాజెక్టులు, మిషన్ భగీరథ, కాకతీయ ఇలా ఏ పతకం చేపట్టినా వేల కోట్లల్లో అవినీతికి పాల్పడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధర్మపురి ముదిరాజ్, తారాసింగ్, కుమ్మరి శంకర్, బుడాల అరుణ్ కుమార్ ముదిరాజ్, రాగం సురేష్, మల్లేష్, సాయి, శ్రీకాంత్, లక్ష్మణ్, రాము, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణభారతావనిలో ఏకైక సినీ స్వరం ఘంటసాల



ప్రసంగిస్తున్న ప్రముఖ సాహితీవేత్త, ఎస్‌బిఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకట్ గరికపాటి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: దక్షిణ భారతావనిలో రాజసం తొణికిసలాగే ఏకైక సినీ స్వరం ఘంటసాల అని ప్రముఖ సాహితీవేత్త, ఎస్‌బిఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకట్ గరికపాటి అన్నారు. గురువారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో శ్రీరామ సాంస్కృతిక సేవ సంస్థ అధినేత గోర్తిచంద్రశేఖర్ ఆధ్వర్యంలో పద్మశ్రీ ఘంటసాల వేంకటేశ్వరరావు జ్ఞాపకాలతో 'పాడుతా తీయగా చల్లగా' పేరుతో సినీ సంగీత విభావరి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట్ గరికపాటి మాట్లాడుతూ ఘంటసాల స్వరం తెలుగుజాతికి వరం అని, అలనాటి పాటలు సాహిత్య సమ్మేళితమైనవని, అద్భుతమైన స్వరమాధుర్యంతో కూడుకుందని, అవి ఆల్‌టైమ్ హిట్స్ అని అన్నారు. ఆయన పాటలు పాడిన నిర్మాతలకు కాసులవర్షాలు కురిపించాయన్నారు. ఈ కార్యక్రమంలో గాయనీ గాయకులు బాలకామేశ్వరరావు, వై.రామకృష్ణ, రమణ,రేవతి, చందన, పవన్‌ఉమాపతి, హర్ష, సింధుజ, మహతి, భరద్వాజ్, అభిజ్ఞ అద్భుతంగా గానం చేశారు.

## చైన్ స్నాచర్‌ను పట్టుకున్న అల్వాల్ పోలీసులు

అల్వాల్, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త: చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నిందితుడిని ఇరవై నాలుగు గంటలు లోపు పోలీసులు కటకటాలు వెనుకకు నెట్టారు. సంఘటకు సంబంధించి అల్వాల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్ దేవ్ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కరీంనగర్ జిల్లాకు చెందిన పమ్మిడి ప్రేమ్ కుమార్(25) జీవనోపాది కోసం నగరానికి రెండు సంవత్సరాలు క్రితం వచ్చి నగర శివారు సుచిత్ర వద్ద ఉంటున్నాడు. ఫాల్ సీలింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక పరమైన ఇబ్బందులు నేపధ్యంలో చైన్ స్నాచింగ్ చేయడానికి సమాయత్తం అయ్యాడు. ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం జెజె నగర్‌లోని బాగ్య నిలయం అపార్ట్‌మెంట్ వద్ద కొంత సేపు రెక్కీ నిర్వహించడం జరిగింది. రెండవ ఫ్లోరకు వెళ్ళి నిందితుడు ఓ ఫ్లాట్ కాలింగ్ బెల్ నొక్కాడు. తలుపు తీసిన బాధితురాలి కళ్ళల్లో కారం చల్లాడు. భయబ్రాంతులకు గురైన ఆమె అరవడంతో మెడలోని గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు సీసీ పుటేజిలను జల్లెడ పట్టారు. ఈ నెల 8వ తేదీ ఉదయం రామ్‌నగర్‌లో అనుమానాస్పదంగా బైక్‌పై సంచరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా స్నాచింగ్ విషయం బయట పడింది.

## షాపూర్‌నగర్ రోడ్లకు ఇరువైపులా ఆక్రమణల తొలగింపు



కుత్బుల్లాపూర్ టౌన్‌ప్లానింగ్ సహాయ సిటీప్లానర్ సాయిబాబా, ట్రాఫిక్‌పోలీసు విభాగం ఎసిపి శ్రీనివాస్, ఇంజనీరింగ్ డిప్యుటీ ఇంజనీరు భాను ప్రకాశ్ తదితరులు

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 8 ప్రబాతవార్త : షాపూర్‌నగర్ ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్లను ఆక్రమించి నిర్వహిస్తున్న ఆక్రమణలను అధికారయంత్రాంగం గురువారం తొలగించారు. కుత్బుల్లాపూర్ టౌన్‌ప్లానింగ్ సహాయ సిటీప్లానర్ సాయిబాబా, ట్రాఫిక్ పోలీసు సహాయ కమిషనర్ శ్రీనివాస్, ఇంజనీరింగ్ అధికారి బానుప్రకాశ్‌ల ఆధ్వర్యంలో గురువారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఆక్రమణల తొలగింపును ముమ్మరం చేశారు. వాహణదా రులకు, పాదచారులకు తీవ్ర ఇబ్బందకరంగా మారిన ఆక్రమణల తొలగింపుతో స్థానికంగా ఉద్రిక్తపరిస్థితి చోటుచేసుకుంది. ప్రతినిత్యం వేలవాహనాలతో కిటకిటలాడే రంగాధియోటర్ చౌరస్తా వద్ద వాహనదారులు, పాదచారులు పడుతున్న ఇబ్బందులకు తోడు ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులమేరకు ఆక్రమణల తొలగింపుపై చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

## పొంగి పొర్లుతున్న డ్రైనేజీ



వెంగళరావునగర్ కాలనీ ఏ టైప్ పార్కు వద్ద రోడ్డుపై పారుతున్న డ్రైనేజిని పరిశీలిస్తున్న కన్‌జ్యూమర్ రైట్స్ ప్రొటక్షన్ ఫారమ్ నేషనల్ సెక్రటరీ డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : వెంగళరావునగర్ కాలనీలోని ఏ టైప్ పార్కు చుట్టు నిత్యం డ్రైనేజి పొంగిపొర్లడంతో రోడ్లమీద డ్రైనేజీ ఏరులై పారుతుంది. అదేవిధంగా పార్కుకు వాకింగ్‌కు వచ్చే వాకర్స్‌కు, స్థానికంగా నివాసితులకు నిత్యం డ్రైనేజి పొంగడం వల్ల దుర్వాసనతో కాలనీ వాసులు నివసించలేని పరిస్థితి నెలకొంది. ఈడ్రైనేజి నీరు పార్కు వద్ద నుంచి ప్రధాన రహదారి మీదుగా ప్రభుత్వ పాఠశాల భవాని మెడికల్ షాపువరకు వెలుతుండటంతో నిత్యం పాఠశాలకు వెళ్ళే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈవిషయమై స్థానికంగా ప్రజలు ఎన్నిమార్లు సంబందిత అధికారులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని వాపోయారు. దీనితో కన్‌జ్యూమర్ రైట్స్ ప్రొటక్షన్ ఫారమ్ వోఆర్‌జి జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి వెంటనే స్పందించి ఆప్రాంతాన్ని పరిశీలించి సమస్యను పరిష్కరించే దిశగా అధికారుల దృష్టికి తీసుకువెళ్ళారు. దీనితో అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజి సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించారు.

## మోడీ నాయకత్వంలో ఊహాకందని అభివృద్ధి

**డా.కొరదాల నరేష్**



గావ్ ఛలో బస్తీ ఛలో అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న నరేష్

మూసాపేట, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని ప్రధాని మోడీ నాయకత్వంలో దేశం ఊహాకందని అభివృద్ధి సాధించిందని డాక్టర్ కె.నరేష్ పేర్కొన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ మహంకాళి నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ఉదయం 8 గంటల నుండి బూత్ నెంబర్ 500, 501లలో చేపట్టిన గావ్ ఛలో బస్తీ ఛలో అభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గావ్ ఛలో ఇంచార్జ్ డాక్టర్ నరేష్ విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రధాన మంత్రి అయిన దగ్గరనుంచి ఇప్పటి వరకు దేశానికి ప్రజలకు చేసిన సేవలు, రామజన్మ భూమిలో రామునికి గుడి నిర్మాణం జరిగిన విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ మణి భూషణ్, జిల్లా ఉపాధ్యక్షులు రామరాజు, నరేందర్‌రెడ్డి, నేషనల్ కో ఆర్డినేటర్ కుమార్ యాదవ్, జిల్లా మాజీ సెక్రటరీ కేశవరావు, సీనియర్ నాయకులు రామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి టప్పా రఘురాం, బీజెవైఎం కన్వీనర్ రామకృష్ణ, బీజెవైఎం అధ్యక్షుడు రాహుల్, ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి రమేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు అనిత, సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, రమేష్, జ్యోతి, అనూష, రాజు, నరసింహా, సంతోస్ తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

**నంగారాభేరి లంబాడీ హక్కుల పోరాట సమితి**



ప్రెస్‌క్లబ్‌లో అభివాదం చేస్తున్న వెంకట్ బంజారా, శ్రీనివాస్‌నాయక్, గణేష్‌నాయక్ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 8,ప్రభాతవార్త: లంబాడీల ఆరాధ్యదైవం సేవాలాల్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని నంగారా భేరి లంబాడీ హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. ఈమేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి జాతీయ అధ్యక్షులు పుట్టంగండి శ్రీనివాస్‌నాయక్, రాష్ట్ర అధ్యక్షులు దారావత్ గణేష్‌నాయక్, వెంకట్ బంజారాలు మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సద్గురు సేవాలాల్ జయంతి ఉత్సవాలను జరుపుకునేందుకు ప్రతిజిల్లాకు 5కోట్ల రూపాయలను కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించాలన్నారు. అలాగే కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వంలో లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలన్నారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం 6గంటలలోపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారికంగా ప్రకటించాలని లేనిపక్షంలో 13న అసెంబ్లీని ముట్టడిస్తామన్నారు. ఈసందర్భంగా నూతన కమిటీ లను ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షులుగా గణేష్‌నాయక్, ప్రధాన కార్యదర్శులుగా జలందర్ నాయక్, బి.సుధీర్ చక్రవర్తి, ఉపాధ్యక్షులుగా నేనావత్ రాజు నాయక్, మహిళా అధ్యక్షురాలిగా సుశీలానాయక్ తదితరులను ఎన్నుకున్నారు.

## అద్భుతంగా సాగిన సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8ప్రభాతవార్త: బలిజేపల్లి లక్ష్మీకాంతం రచించిన సత్యహరిశ్చంద్ర నాటకం డాక్టర్ శూలపాణి నిర్వహణలో గురువారం రాత్రి రసరమ్యంగా ప్రదర్శించారు. గురువారం రాత్రి త్యాగరాయ గానసభ నిర్వహనలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణాచారి 72వ జన్మదినోత్సవాల సందర్భంగా ఐదు రోజుల పాటు జరిగే సాంస్కృతిక కార్యక్రమాల సందర్భంగా సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బూర్గుల మధుసూదన్ హాజరై అద్భుతంగా నాటక ప్రదర్శన నిర్వహించిన కళాకారులను సత్కరించారు.

## హైటెక్స్‌లో ప్రారంభమైన జిఎస్ఐ ఎక్స్‌పో 2024



గచ్చిబౌలి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : హైటెక్‌సిటీ పరిధిలోని హైటెక్స్‌లో గిఫ్ట్ ఆండ్ స్టేషనరీ ఇండియా(జిఎస్ఐ) ఎక్స్‌పో 2024 గురువారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ఎక్స్‌పోలో దేశ, విదేశాలకు చెందిన ప్రముఖ బ్రాండింగ్ సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచాయి. ఎక్స్‌పో ప్రారంభోత్సవం సందర్భంగా గెలాక్సియా ఇంచార్జ్ రాఖీ ముఖర్జీ మాట్లాడుతూ ది కార్పొరేట్ గిఫ్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సిజిఎఐ) స్వచ్ఛంద సంస్థకు చెందిన సభ్యులు ఈ ఎక్స్‌పోలో పాల్గొంటున్నారని తెలిపారు. ఇండియన్ స్టేషనరీ ఇండస్ట్రీలో వచ్చిన విప్లవాత్మకమైన ప్రాడక్ట్స్‌ను ప్రదర్శనకు ఉంచారన్నారు. బ్రాండింగ్ మిషనరీ, కెమెరాలు, హ్యాండీ క్రాఫ్ట్స్, నావెల్టీస్,కంప్యూటర్, మొబైల్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, డ్రైఫ్రూట్స్, గిఫ్ట్ హ్యాంపర్స్, కాస్ట్యూమ్, స్కూల్, కాలేజీలు, ఆఫీసులకు సంబంధించిన స్టేషనరీలను ప్రదర్శనలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. హైదరాబాద్ కేంద్రంగా జాతీయ, అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ సంస్థలు, ఫార్మా కంపెనీలు ఉండడంతో కార్పొరేట్ గిఫ్ట్ వ్యాపారం నగరంలో ఎక్కువగా జరుగుతుందన్నారు. తెలంగాణలో 230 మిలియన్ డాలర్ల కార్పొరేట్ గిఫ్ట్ వ్యాపారం సాగుతుందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని నగరంలో ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు రాఖీ ముఖర్జీ తెలిపారు.

## క్రైస్తవ సమాజమంతా ప్రభుత్వానికి అండగా ఉంటుంది



సమావేశమైన క్రైస్తవ సంఘాల రాష్ట్ర నాయకులు, బిషప్‌లు, పాస్టర్లు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని క్రైస్తవ సమాజమంతా రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉంటామని తెలంగాణ యూనైటెడ్ క్రిస్టియన్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్(టియుసిపిఏ), బంజారా ఫెలోషిప్ ఆఫ్ ఇండియా(బిఎఫ్ఐ), జంటనగరాల పాస్టర్స్, లేమెన్ ఫెలోషిప్(టిసిపిఎల్ఎఫ్), దక్కన్ అమెరికా బాప్టిస్ట్ కౌన్సిల(డిఏబిసి), యూనైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్(యుపిఎఫ్), జంటనగరాల క్రిస్టియన్ యూత్ ఫెలోషిప్(టిసిసివైఎఫ్) సంయుక్తంగా నిర్వహించిన సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఈ సంవత్సరం మార్చి నెలలో అన్ని క్రైస్తవ సంఘాలతో కలిసి లక్ష మందితో 'ఐక్య మహాసభ' నిర్వహించాలని నిర్ణయించింది. గురువారం జరిగిన క్రిస్టియన్ అసోసియేషన్‌ల సమావేశం తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ సెనాడ్(టియుసిఎస్) తెలంగాణ సొసైటీ చట్టం కింద నమోదు) ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గ్రాండ్‌పాట్రన్స్ బిషప్ లాజర్ లాల్‌సింగ్, బిషప్ కె.తిమోతి, రేవరెండ్ పి.మెన్నో జోయెల్, నవీన్ చైత్య(అధ్యక్షుడు), బిషప్ కె.విద్యాసాగర్(ఉపాధ్యక్షుడు), జోసెఫ్ అంజన్న(సంయుక్త కార్యదర్శి), కమిటీ సభ్యులు డి.సువర్తమ్మ పాల్గొన్నారు.

## దహన సంస్కారాలకు రెండు లక్షలు అందజేసిన ఎమ్మెల్యే కాలేరు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: నిరుపేదల దహన సంస్కారాలకు అండగా నిలుస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గురువారం 40 మందికి సంబంధించి రెండు లక్షల రూపాయలను విడుదల చేశారు. ఈ మేరకు రెండు లక్షల రూపాయల చెక్కును హిందు స్మశానవాటిక కార్యదర్శి కుమార్‌కు అందజేయడం జరిగిందన్నారు.





మాస్టర్ ఆఫ్ ఫార్మాసిలో గోల్డ్‌మెడల్ అందుకుంటున్న విద్యార్థినీ ఆర్.ఎన్.నమ్రత

## మాస్టర్ ఆఫ్‌ఫార్మాలో గోల్డ్‌మెడల్

బేగంబజార్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: ఓల్డ్ ఇజ్,గోల్డ్ అనే నానుడి పదాన్ని నిజం చేసి చూపించింది.పాతనగరం పురానాపూల్ ప్రాంతానికి చెందిన ఓ దళిత విద్యార్థినీ మాస్టర్ ఆఫ్‌ఫార్మాలో గోల్డ్‌మెడల్ సాధించింది. మెహదీపట్నంలోని జి.పుల్లా రెడ్డి కళాశాలల్లో పురానాపూల్ చంద్రికపురం ప్రాంతానికి చెందిన ఆర్.ఎన్.రావుల నర్సింగ్‌రావు కుమార్తె విద్యార్థినీ ఆర్.ఎన్.నమ్రత మాస్టార్ ఆఫ్ ఫార్మాసిలో రిసెర్చ్ చేసింది. కళాశాల అధ్యాపకుల ప్రోత్సాహంతో నమ్రత పట్టుదలతో చదివి గోల్డ్‌మెడల్ సాధించింది. కళాశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొఫెసర్ చేతుల మీదుగానమ్రత గోల్డ్‌మెడల్‌ను అందచేశారు. ఈకార్యక్రమంలో విద్యార్థినులు,కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.చంద్రికపురం బస్తీవాసులు నమ్రతను అభినందించారు.

## బాల్కసుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలు క్రైస్తవులు క్షమించరు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ సిఎం రేవంత్‌రెడ్డిపైచేసిన అనుచిత వ్యాఖ్యలను సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనీల్‌కుమార్ యాదవ్, బుసమల్ల మైఖేల్ ప్రసన్న తీవ్రంగా ఖండించారు. గురువారం చిక్కడపల్లిలో మాట్లాడుతూ ఓయు ఉద్యమనాయకుడిగా చెప్పుకునే బాల్కసుమన్ కెసిఆర్ కుటుంబానికి పెద్దబానిసగా ఉన్నారని, కెసిఆర్ నుంచి మెప్పు పొందడానికి ఇలాంటి చౌవకబారు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.

## విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరం : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



సత్యసాయి గ్రూప్ స్కూల్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ఉప్పల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** శారీరక దారుఢ్యాన్ని పెంపొందించేందుకు క్రీడలు దోహదపడుతాయని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో సత్య సాయి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఐదవ ఆగమ్మ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి బిఆర్‌ఎస్ సీనియర్ నేతలు రాగిడి లక్ష్మారెడ్డి, పసుల ప్రభా కర్‌రెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు తదితరులతో కలిసి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు, క్రీడల పట్ల ఎంతో ఆసక్తి ఉండాలని, క్రీడాకారులకు తగు సహకారం అందిస్తామన్నారు. గత 20సంవత్సరాలుగా ఉత్తమ విద్యాసంస్థలుగా ఎదిగిన సత్యసాయి స్కూల్స్‌కు తనవంతు సహకారమందిస్తామని తెలిపారు. స్కూల్ చైర్మన్ గడ్డం సాయికిరణ్ మాట్లాడుతూ విద్యార్థులను ఎన్నో ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు ఎంతో కృషిచేస్తున్నారని, తెలంగాణలో ఎక్కడ క్రీడలు జరిగినా తమ పాఠశాల విద్యార్థులకు మొదటి స్థానం సాధిస్తు న్నారని తెలిపారు. ఈ సందర్భంగా కబడ్డీ క్రీడలు ఆడి క్రీడా పోటీల ను ప్రారంభించారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నేతలు డా.బి.వి.చారి, సోమిరెడ్డి, కాలేరు జైనవీన్, బి.కైలాసపతిగౌడ్, సూరం శంకర్, సంజయ్ జైన్, పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## క్రీడాకారులను ప్రోత్సహించాలి : చిలుక



క్రీడాకారులను సన్మానిస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** యువ క్రీడాకారులను ప్రోత్సహించ డంవల్ల క్రీడాకారులకు మంచి భవిష్యత్తుంటుందని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురండివిజన్ అల్కాపురి భవన్‌లో గత వారం రోజుల క్రితం ఎస్సార్ మీడియా వర్క్స్ అధ్వర్యంలో 12వ జాతీయ స్థాయి ఓపెన్ క్యారమ్ టోర్నమెంట్స్ నిర్వహించారు. ఈ పోటీలలో నేషనల్ ఛాంపియన్ కె. శ్రీనివాస్‌తో జరిగిన పోటీలో తెలంగాణ రాష్ట్ర క్యారమ్ ఛాంపియన్ యస్. ఆదిత్య ఘనవిజయం సాధించారు. గొప్ప విజయాన్ని సాధించిన విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు ఉపేందర్ రెడ్డి గురువారం వాసవి కాలనీలో క్యారం ఛాంపియన్ ఆదిత్యను అభినందించి, జ్ఞాపికను అందించి, శాలువాతో ఘనంగా సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో నాగోల్ సుధాకర్‌చారి, భరద్వాజ, రామచంద్రారెడ్డి, రాజగోపాల్, వినయ్, వంగాల శ్రీకాంత్‌రెడ్డి, పగిళ్ల పురుషోత్తం, విప్లవ్, సంతోష్, ప్రభ, రాము తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి : లచ్చిరెడ్డి



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

**వనస్థలిపురం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, విధులను సక్రమంగా నిర్వర్తించాలని బిఎన్‌రెడ్డిగన్ డివిజన్‌కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పారిశుధ్య కార్మికులకు సూచించారు. గురువారం డివిజన్ పరిధిలో ని పలు కాలనీలలో పర్యటించి వారి పనితీరును పరిశీలించారు. ఈ సంద ర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ నిత్యం కాలనీలలో రోడ్లు శుభ్రం చేసి, రోడ్లపై ప్లాస్టిక్ కవర్లు తొలగించి శుభ్రంగా ఉంచాలని కోరారు. ప్లాస్టిక్ రహిత డివిజన్ గా డివిజన్‌ను తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి సూపర్‌వైజర్ అజీముద్దీన్, ఎస్‌ఎఫ్ఎ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సరూర్‌నగర్‌లో గావ్ చలో అభియాన్

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని సరూర్ నగర్ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు సిద్దుముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం బంగారు మైసమ్మదేవాలయంలో గావ్ చలో అభియాన్ కార్యక్రమం నిర్వహిం చారు. సరూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవే శ పెట్టిన ఆయుష్మాన్ భారత్ వివరాలను గురించి నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా బీజేపీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ఆరుట్ల సురేష్‌కుమార్, మాజీ కౌన్సిలర్ స్వరూప, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఝాన్సీ రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బెంగరబోయిన సురేష్‌ముదిరాజ్, జంగయ్యముదిరాజ్, గోపీకృష్ణ, త్రివిది, శ్వేతా, అనిత, పోలె సురేష్, శ్రీకాంత్, చంటి, నవీన్, గణేష్ పాల్గొన్నారు.

## ట్రంక్‌లైన్ ఏర్పాటుతో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం : కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి

**హయత్‌నగర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** ట్రంక్‌లైన్ ఏర్పాటు చేయడం ద్వారా మున్సిపాలిటీలో ప్రధానమైన డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ చల్లూరి మురళీధర్‌రెడ్డి అన్నారు. వార్డుపరిధిలో సూర్యవంశి గార్డెన్‌సిటీ కాలనీ నుంచి జాతీయ రహదారి వరకు ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు ఆయన గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ ప్రధాన సమస్యగా మారిందన్నారు. సమస్య పరిష్కారంలో భాగంగా 6 కోట్ల రూపాయల మున్సిపల్ సాధారణ నిధులకు(50 శాతం) తోడుగా మరో 50 శాతం నిధులను హెచ్‌ఎండీఏ నిధు లను కేటాయించి పసుమాముల వరకు ట్రంక్‌లైన్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. దీంతో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నా రు. డీపీఆర్ తయారు చేసినా కొన్ని అడ్డంకుల కారణంగా పనులు ఆలస్యం అయ్యాయని సాధ్యమయినంత త్వరలో పనులను పూర్తిచేస్తామన్నారు. 9వ వార్డు పరిధిలోని ఇతర కాలనీలలో కూడా పనులను ప్రారంభించి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు నరేందర్ రెడ్డి, నక్కల రవీందర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

## రామకృష్ణాపురం చెరువు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి



ఇరిగేషన్ పనులను అధికారులతో కలసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి

**నేరెడ్‌మెట్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** మల్కాజిగిరి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువా రం నియోజకవర్గ పరిధిలోని నేరెడ్‌మెట్ డివిజన్ రామక్రిష్ణ పురం చెరువు వద్ద జరుగుతున్న ఇరిగేషన్ పనులను ఆయన సంబంధిత అధికారులతో కల సి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. అంతేకాకుండా రామక్రిష్ణపురం సమాం తర బ్రిడ్జి ప్రతిపాదనలను రైల్వే ఇంజనీరింగ్, ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారు లతో కలసి పరిశీలించారు. త్వరలోనే మల్కాజిగిరిని పూర్తిస్థాయిగా అభివృద్ధి పరుస్తానన్నారు. ప్రజలు తనపై నమ్మకం ఉంచి తనకు ఈ బాధ్యతను అప్ప గించడం జరిగిదన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ రైల్వే బ్రిడ్జి ఇంజనీర్ జగదీష్, ఎస్సిప్రసాద్, ప్రకాష్, జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ సురేస్, డీఇ రేణుక, ఏఇ సాయిక్రిష్ణ, బి.ఆర్.ఎస్ నాయకులు ఉపేందర్ రెడ్డి, శ్రీని వాస్ రెడ్డి, మదుసూధన్‌రెడ్డి, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ కేంద్రం సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది: కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి



పథకాలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేస్తున్న నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వం సంక్షే మ పథకాలను అమలు చేస్తోందని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడంలో భాగంగా హయత్‌నగర్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ యువజన సంఘం వద్ద వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ... రైతు సంక్షేమం, నారీశక్తికి నూతన ఉత్తేజం, అమృత్ తరానికి సాధికారత, సులభతర వాణిజ్యం, పీఎం విశ్వకర్మ పథకం, పీఎం కిసాన్ యోజన, ప్రధాన మంత్రి శ్రమయోగి, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, వన్‌నేషన్ వన్ రేషన్ కార్డు, బేటీ బచావో, బేటీ పడావో, ప్రధాన మంత్రి కౌషల్ వికాస్ యోజన, ప్రధాన్‌మంత్రి గ్రామీన్ వికాస్ యోజన, పీఎం జన్ దన్‌యోజన వంటి పథకాలతో పేద, మధ్యతరగతి ప్రజలు ఎంతో లబ్ది పొందుతున్నారని వివరించారు. కరోనా సమయం నుంచి నేటివరకు ఉచితంగా రేషన్ బియ్యం ఇవ్వడం కేవలం నరేంద్ర మోడీ ప్రభుత్వంతోనే సాధ్యమయిందన్నారు. అగ్రదేశాలు సైతం కరోనాతో విలవిలలాడితే మన దేశంలో తయారయిన వ్యాక్సిన్లను ఇతర దేశాలకు సైతం ఎగుమతి చేసిన ఘనత బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో సైతం మరోసారి నరేంద్రమోడీ నాయకత్వంలో బీజేపీ పూర్తి మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు బండారి భాస్కర్, అప్పారావు, గోవిందచారి పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీలు: కార్పొరేటర్ మాధవి



దరఖాస్తుదారులకు భరోసా కల్పిస్తున్న కార్పొరేటర్ మాధవి ఈశ్వర్‌గౌడ్

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందే విధంగా కృషి చేస్తామని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 45వ డివిజన్ కార్పొరేటర్ అక్కి మాధవి ఈశ్వర్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి భరోసా కల్పించే నిమిత్తం గురువారం ఆమె డివిజన్‌లో పర్యటించి దరఖాస్తుదారులను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్యారంటీ పథకాలకోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి వారికి ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందిస్తుందని వెల్లడించారు. లబ్ధిదారుల ను ఎంపిక చేసే నిమిత్తం ఎంక్వయిరీకి అధికారులు వస్తున్న నేపథ్యంలో దరఖాస్తుదారులు తాము అప్లై చేసిన స్లిప్పులను, ఆధార్ కార్డులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. డివిజన్‌లో అర్హులకు పథకాలు అందే విధంగా తాను కృషిచేస్తానని ఆమె తెలిపారు. ఎంక్వయిరీకి అధికారులు రాని పక్షంలో తమకు సమాచారం అందించాలని ఆమె కోరారు.

## అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్‌గా సైదయ్య

**అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్‌గా సైదయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల రాచకొండ కమిషనర్ చేపట్టిన ఇన్‌స్పెక్టర్ల బదిలీలలోభాగంగా యాచారం ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వ హిస్తున్న సైదయ్యను అబ్దుల్లాపూర్‌మెట్‌కు బదిలీ చేశారు. మెట్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన మన్మోహన్‌ను స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు.

## బాల్క సుమన్‌ను అరెస్టు చేయాలి : బద్దూరి



పోలీసులకు వినతి పత్రం అందజేస్తున్న బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** సిఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్య లు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను అరెస్టు చేసి కఠినంగా శిక్షించా లని రెడ్డి సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌పై చైతన్యపురి పోలీసులకు బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడు తూ ప్రజాస్వామ్యబద్ధంగా ముఖ్యమంత్రిగా ఎన్నికైన రేవంత్‌రెడ్డిపై బాల్క సుమన్ నోరు పారేసుకోవడంపట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాల్క వ్యవ హారం ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసే విధంగా ఉందని మండిపడ్డారు. అతనని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.

## కూచిపూడిలో శాన్విశ్రీకి నేషనల్ అవార్డు



నృత్యం చేస్తున్న బేబి శాన్విశ్రీ

**వనస్థలిపురం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చర్, మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ సంయుక్తంగా నిర్వహించిన 10 నేషనల్ డాన్స్ పోటీలలో వనస్థలి పురంకు చెందిన బేబి శాన్విశ్రీకి కూచిపూడి నాట్యంలో నేషనల్ అవార్డు లభించింది. ఆన్‌లైన్‌లో నిర్వహించిన నృత్యపోటీలలో 2500 మంది పాల్గొన గా శాన్విశ్రీకి ద్వితీయ బహుమతి వరిం చింది. డాక్టర్ మనోజ్ఞ, రామకృష్ణల కుమార్తె శాన్విశ్రీ ఎన్‌కెఎన్ కళాక్షేత్రం డాన్స్ అండ్ మ్యూజికల్ అకాడమీలో శిక్ష పొందింది. శాన్విశ్రీ అక్షర పాఠశాల లో 2వ తరగతి అభ్యసిస్తుంది. నేషనల్ అవార్డుసాధించిన శాన్విశ్రీని కూచిపూడి నాట్య గురువులు డా. మనోజ్ఞ, డాక్టర్ కృష్ణకుమారి, వేదాంతం రాధేశ్యాం, పసుమర్తి శేషబాబు తదితరులు అభినందించారు.

## మురికివాడల అభివృద్ధికి కృషి : శ్రీవాణి



నెహ్రూనగర్ మురికివాడలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** మురికివాడల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నామని రామంతాపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి పేర్కొ న్నారు. ఈ మేరకు గురువారం పలువురు మున్సిపల్ అధికారులతో కలిసి నెహ్రూనగర్ మురికివాడలో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్ర మంలో ఆమె మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి మురికివాడల అభివృద్ధికి తగు ప్రా ధాన్యత ఇస్తుందని, మురికివాడలలో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నెహ్రూనగర్‌లో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని, కాలనీలో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ నాగమణి, ఎఇ శ్వేతశ్రీ, శ్రీదర్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, డివి జన్ బిజెపి అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, సంకూరి కుమారస్వామి, నారాయణదాసు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద మహిళలకు చేయూత : సర్వబాబు



నిరుపేద మహిళకు చేయూత అందిస్తున్న సర్వ బాబుయాదవ్ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** నిరుపేద మహిళలకు తనవంతు సహకారం అందిస్తామని రామంతాపూర్ డివిజన్ బిఆర్‌ఎస్ నేత సర్వ బాబుయాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రామంతాపూర్ వివేక్‌నగర్‌కు చెందిన నిరుపేద మహిళ స్వర్ణ ప్రియ వివాహానికి రూ.ఐదు వేల ఆర్థిక సహాయంతో పాటు,చీర ఇతర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పేదల కోసం పాటుపడే వారికి తగు చేయూత అందిస్తానని తెలిపారు. స్వర్ణప్రియ వివాహానికి తగు చేయూత అందించినట్లు తెలిపారు. ప్రజల కోసం పాటుపడే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ మహిళ నేతలు జానకి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## పదేళ్ల క్రితం తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత



పదేళ్ల క్రితం తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఉప్పల్ సిఐ ఎలక్షన్‌రెడ్డి, ఎస్‌ఐ నెహ్రూ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** పదేళ్ల క్రితం తప్పిపోయిన ఒక బాలుడిని పోలీసులు ఆధార్ టెక్నాలజీ సహాయంతో భువనేశ్వర్‌లో పట్టుకుని బాలుడి తల్లిదండ్రులకు అప్పగించారు. ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ కేసు వివరాలను సిఐ ఎన్.ఎలక్షన్‌రెడ్డి, ఎస్ఐ నెహ్రూ తెలిపిన వివరాల ప్రకా రం ఉప్పల్ చిలుకానగర్‌లో నివసించే నారాయణశర్మ కుమారుడు రోహిత్‌శర్మ అలియాస్ పవన్‌శర్మ 2013 జూలై 4వ తేదిన ఇంటి నుంచి బయటకు వెళ్లి తప్పిపోయాడు. అప్పటికి రోహిత్‌శర్మ వయస్సు ఎనిమిదేళ్లు. ఇంటి నుంచి బయటికి వెళ్లి కనిపించకపోవడంతో అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసి పలు ప్రాంతాల్లో గాలించి మిన్నకుండిపోయారు. అయితే తప్పిపోయిన రోహిత్‌శర్మ కొద్ది రోజుల క్రితం ఒరిస్సా భువనేశ్వర్‌లో తన అధార్ కార్డు అప్‌డేట్ చేయిం చుకోవడంతో దీని అధారంగా పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి బాలుడి ఆచూకి కనుగొన్నారు. ఎస్ఐ నెహ్రూ, కానిస్టేబుల్ కె.దేవేందర్, కె.అనిల్ ఆధార్‌కార్డులో ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా బాలుడు ఉన్న ప్రాం తానికి వెళ్లి అతనిని పట్టుకున్నారు. బాలుడు భువనేశ్వర్‌లోని చైల్డ్ వెల్ఫేర్ కమిటి సంరక్షణలో ఉన్నట్లు తెలిపారు. తప్పిపోయిన బాలుడిని పదేళ్ల తర్వా త పోలీసులు తీసుకుని వచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడిని కను గొనడంలో క్రియాశీలక పాత్ర పోషించిన పోలీసులను రాచకొండ కమిషనర్ అభినందించారు. పదేళ్లతర్వాత తమ కుమారుడు తిరిగి వారికి వద్దకు చేరడం తో తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పోలీసులు పనితీరును పలువురు అభినందించారు. డిసిపి పద్మజారెడ్డి ఆధ్వర్యంలో ఎసిపి చంద్రశేఖర్, సిఐ ఎన్.ఎలక్షన్‌రెడ్డి పోలీసులు అభినందించారు. ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఉప్పల్ అసెంబ్లీ ఓటర్ల జాబితా విడుదల

**ఉప్పల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :** ఉప్పల్ అసెంబ్లీ ముసాయిదా ఓటర్ల జాబితాను గురువారం అధికారులు విడుదల చేశారు. ఎన్నికల అధికారి, డిసి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు కొత్త ఓటర్ల జాబితా మీడియాకు విడుదల చేశారు. కొత్త జాబితా ప్రకారం.. కాప్రా సర్కిల్‌లో మొత్తం 236 పోలింగ్ స్టేషన్లు ఉండగా మొత్తం 308369మంది ఓటర్లుండగా, వీరిలో పురుషులు 160130, మహిళలు 148217 ఉన్నారు. ఇతరులు 22మంది ఉన్నట్లు తెలి పారు. ఉప్పల్ సర్కిల్‌లో 171 పోలింగ్ స్టేషన్లు ఉండగా, వీరిలో పురుషులు 115099 పురుషులు, 105930 మంది మహిళలు, ఇతరులు 18 మంది ఉన్నట్లు డిసి శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 407 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వీరిలో పురుషులు 275229, మహిళలు 254147, ఇతరులు 40 మంది ఉన్నట్లు తెలిపారు. మొత్తం 529416 మంది ఉన్నారని తెలిపారు. ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ పేర్లు చూసుకోవాలని కోరారు.

## లింగోజిగూడ డివిజన్‌లో రూ. కోటి 27 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్‌లోని పలు కాలనీల లో ఒక కోటి 27 లక్షల రూపాయల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గురువారం స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావులతో కలిసి శంకుస్థాపన చేశారు. రూ.92 లక్షలతో గ్రీన్‌పార్క్ కాలనీ రోడ్డు నెం.1 నుంచి 17 వరకు సిసి రోడ్డు మరమ్మత్తు పనులు, రూ.35లక్షలతో శ్రీరాంనగర్ కాల నీలో కమ్యూనిటీహాల్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రీన్‌పార్క్ కాలనీ ఎఫ్‌టిఎల్ సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, బిఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్న మేయర్ చిగిరింత పారిజాత బృందం



అమ్మవార్లకు మొక్కులు సమర్పించడానికి వెళ్తున్న పారిజాత బృందం

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి గురు వారం మేడారం సమ్మక్క సారలమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నా రు. బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేటర్లు రాళ్ళగూడెం సంతోష శ్రీనివాస్‌రెడ్డి, పోరెడ్డి పద్మాభాస్కర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు పెద్దబావి మౌనిక సుదర్శన్‌రెడ్డి, యువనాయకులు చిగిరింత దయాసాగర్‌రెడ్డి, పెద్దబావి బాలకృష్ణారెడ్డి తదితరులతో కలిసి ఆమె ములుగు జిల్లా మేడారంకు వెళ్ళి సమ్మక్క, సారలమ్మల గద్దెలను సందర్శించారు. అనంతరం ఆమె అమ్మ వారికి బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## బస్తీలకు పోదాం పదండి : కార్పొరేటర్



బస్తీ ఛలో కార్యక్రమంలో ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, జయప్రకాష్ తదితరులు

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** బీజేపీ గడ్డిఅన్నారం డివిజన్ అధ్య క్షులు దాసరి జయప్రకాష్ ఆధ్వర్యంలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ పరిపాలన, సంక్షేమ పథకాల గురించి గడ్డిఅన్నా రం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం తీసుకొచ్చిన పథకాలను వివరించి రాబో యే పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కార్యకర్తలు, బూత్ అధ్యక్షు లు ప్రతిఒక్కరికీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గావ్ ఛలో అభియాన్ కన్వీనర్ ఏనుగు శ్రీధర్‌రెడ్డి, బొమ్మరాజు సందీప్, ఓంకార్, చిలకూరి మధుసూదన్, సుబ్బారెడ్డి, శ్రీనివాస్, ధనరాజ్, వెంకట్‌రెడ్డి, రత్నం, సిరిరెడ్డి, జయ, పద్మజ, శరత్, వినయ్, దినేష్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన మీర్‌పేట్ పోలీసులు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** మీర్‌పేట్‌లోని నారాయణ ఐఐటి ఒలం పియాడ్ పాఠశాలలో గురువారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ కాశీ విశ్వనాథ్, ఎస్ఐ సుధాకర్‌ల ఆధ్వర్యం లో అనిల్‌కుమార్ సైబర్ క్రైమ్‌ల గురించి విద్యార్థులకు వివరించారు. బోగస్ కాల్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్, క్రిఫ్టో కరెన్సీ, మనీ యాప్‌ల మోసాల గురిం చి ఆయన తెలియజేశారు. అదే విధంగా ఓటిపిలను ఎవరికీ షేర్ చేయవద్దని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎజిఎం రవీ ంద్రబావు, ప్రిన్సిపాల్ బాబ్జీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆంధ్రరాష్ట్రంలో మరోసారి జగన్‌దే అధికారం



విలేకరులతో మాట్లాడుతున్న ఎడ్ల వాసుదేవరెడ్డి

**సైదాబాద్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి జగన్ నేతృ త్వంలో వైకాపా అధికారంలోకి రావడం ఖాయమని వైఎస్‌ఆర్ అభిమాని ఎడ్ల వాసుదేవరెడ్డి అన్నారు. యాత్ర 2 సినిమా రీలీజ్ అయిన సందర్భంగా ఎల్‌బి నగర్‌లోని థియేటర్‌లో వైఎస్ అభిమానులు, వైఎస్‌ఆర్ సిపి కార్యకర్తలు దాదాపు 500 మందికి వాసుదేవరెడ్డి తన స్వంత డబ్బులతో సినిమా టికెట్లు కొనుగోలు చేసి సినిమా చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సంక్షేమ పథకాలు, అభివృద్ధి రంగంలో ముందంజలో ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుయుక్తులు, కుట్రలు చేసినా మరోసారి జగన్‌కే ఆంధ్ర ప్రజలు పట్టం కట్టనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సుధీర్, రఘువీర్‌రెడ్డి, యశ్వంత్, భాస్కర్, జితేందర్, క్రాంతి, జైపాల్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.